క్లుప్తంగా

పాస్టర్లకు నూతన వస్త్రాల పంపిణీ



తెనాలి అర్బన్: ఇంటర్నేషనల్ బిషప్ గద్దం థామస్ 2వ వర్ధంతిని అయితానగర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద పాస్టర్లకు నూతన వస్త్రాల్నిపంపిణీ చేశారు. కార్యక్రమంలో గద్దం సన్నీ డానియేల్, గద్దం డేవిడ్ జాన్, గద్దం థామస్ జాన్, బాబు, చొప్పర డానియేల్, పీటర్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి తరలిరావాలి

కొల్లిపర: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, రైతాంగ హక్కుల కోసం ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి వేలాది మంది తరలిరావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సంపదను పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. ప్రతి ఉద్యోగికి కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ విధానం ఎత్తివేసి పర్మినెంట్ ఉద్యోగ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం చేయాలని కోరారు. అరవై ఏళ్లు నిండిన రైతులు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు ఎం. జయప్రద, కె.భవాని, టి.దీప్తి, రమేష్ , జిలుగు ముక్కంటి , గోదా ఏసుపాదం, ములకా శివకుమారి, జి.రామయ్య, రైతులు పాల్గొన్నారు.

11,12 తేదీల్లో వినాయక ఆలయ వార్షికోత్సవం

వల్లభాపురం (కొల్లిపర): మండలంలోని వల్లభాపురంలో ఈనెల 11,12 తేదీల్లో శ్రీవినాయకస్వామి ఆలయ 111వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయ ప్రాంగణంలో మాట్లాడారు. 11న ఉదయం 10.30కి వేద ప్రచారకులు శ్రీ గొడవర్తి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విశ్వశాంతి యజ్ఞం(శాంతి హోమం), 12న 500కు పైగా సుందరకాండ పారాయణాలు నిర్వహించిన చిర్రా విష్ణువర్ధనరెడ్డి ఆధర్యంలో పారాయణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాల్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు అచ్యుత శ్రీరాములు, అచ్యుత ప్రభాకరబాబు, భక్తులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులో శతాధిక వృద్ధురాలు తాళ్లూరి పుణ్యవతి (108) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె, మనవలు, మనమరాండ్రు, ముని మనవరాలు ఉన్నారు. ఆమె భర్త గతంలోనే మృతి చెందారు. గ్రామంలో పలువురు పుణ్యవతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



పుణ్యవతి (ఫైల్)

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

తెనాలి రూరల్: చోరీ కేసుల్లో నిందితుడికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో గతేడాది జరిగిన మూడు చోరీ కేసుల్లో నిందితుడిని నందులపేటకు చెందిన కోటిసాయి మంజునాథగా గుర్తించారు. కేసులను దర్యాప్తు చేసిన సీఐ కె. చంద్రశేఖర్, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు అక్టోబరులో ఇతని వద్ద నుంచి ఐదు మోటారు సైకిళ్లను రికవర్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు బుధవారం విచారణకు రాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా నిందితుడికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

విద్యుత్ తీగలు రాసుకుని గడ్డి దగ్ధం

రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదంలో గడ్డి దగ్ధమైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి వై.సాంబశివరావు కథనం మేరకు నగరం.. మండలం ధూళిపూడి నుంచి రేపల్లె మండలం ఉప్పూడికి చెందిన దాసరి సుదర్శన్ రెండు ఎకరాల గడ్డిని మినీ ట్రాక్టర్‌పై బుధవారం తరలిస్తున్నాడు. 13వ వార్డు సమీపంలో చేరుకోగానే విద్యుత్ తీగలు రాసుకుని ట్రాక్టర్‌లోని గడ్డిపై రవ్వలు పడటంతో నిప్పు అంటుకుంది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ట్రాక్టర్‌కు ప్రమాదం వాటిల్లలేదని, రూ.15వేల నష్టం జరిగిందని అగ్నిమాపకశాఖ అధికారి తెలిపారు.

సంస్కరణల సారథి సీఎం జగన్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 30వ వార్డులో కొనసాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: రాష్ట్రంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 30వ వార్డు చెంచుపేటలోని ఆర్‌సీఎం చర్చి ఎదురు రోడ్డు నుంచి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ వార్డు కౌన్సిలర్ కొమ్మరబత్తిన జయపాల్, నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆయన వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే పాలనను ప్రభుత్వం తెచ్చిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో మరోసారి తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. 30వ వార్డులో ఇప్పటికే రూ.కోటితో పలు అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తుచేశారు. మంచినీటి పైప్‌లైన్ కోసం రెండు రోడ్లను తవ్వి వదిలేశారని, అవి పాడై రాకపోకలకు అవరోధంగా మారిందని, ప్రజల కోరిక మేరకు నూతన రోడ్లను వేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు తెలియజేసిన ప్రతి గ్రీవెన్స్‌ను నమోదు చేసుకున్నామని, వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, 30వ వార్డు నాయకులు గుమ్మడి నారాయణరావు, ఏసీ సిద్ధయ్య, నాగరాజు, కనపర్తి రజని, ఎం.గోపీచంద్, కె.వెంకట్రావు, ఎ.రమేష్, ఎస్.పురుషోత్తం, కె.వినోద్, వై.యోహాన్, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, చుండూరి వెంకటేశ్వరరావు, కఠారి హరీష్, చుండూరు సాయి, రావి శ్రీనివాసరావు, దేవరపల్లి కిశోర్, చుక్కా ఆనంద్, షేక్ గఫూర్, కాకిదేవసహాయం, బండ్లమూడి భాస్కరరావు, బొల్లినేని బుజ్జి, చింతలచెరువు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు



ఎంపీపీతో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ఎస్ ఆర్పీ, డీఆర్పీలు, ప్రజా ప్రతినిధులు

భట్టిప్రోలు: మండలంలోని సచివాలయాల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలలో గురువారం నుంచి 2020–21 ఆర్థిక సంవత్సరానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్)కింద నిర్వహించిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు జరుగనున్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ రీసోర్స్ పర్సన్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రిసోర్స్ పర్సన్లు ఎం.పెద్దయ్య, సి.చిరంజీవి భట్టిప్రోలు వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. జేఈ జయచంద్ర కుమార్ మాట్లాడుతూ మండలంలో మూడు బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. 1.80 లక్షల పని దినాలకు గానూ కూలీలకు రూ. 5 కోట్లు, మెటీరియల్ కింద రూ.1.50 కోట్లు వెరసి మొత్తం రూ. 6.50 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సూరేపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, ఓలేరు సర్పంచ్ మేరుగ రంగారావుపాల్గొన్నారు.

వలంటీర్లకు నియామకపు ఉత్తర్వులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో ఇటీవల నాలుగు వలంటీర్ల పోస్టులు ఖాళీ కావడంతో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు అధ్యక్షతన అవి భర్తీ అయ్యాయి. ఎంపికైన వలంటీర్లకు బుధవారం ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి చేతుల మీదగా నియామకపు ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో అక్లమూడి, ఓలేరు గ్రామ సర్పంచులు పెద్దిశెట్టి రాంబాబు, మేరుగ రంగారావు, సూరేపల్లి పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెదలంకలో రుద్ర హోమం

పెదలంక(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామంలో కొలువైన గంగాపార్వతి సమేత పృథ్వీశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం చండీ హోమం శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ప్రఖ్యా మణికంఠ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. మాఘమాసం పురస్కరించుకుని ప్రతి ఏటా మహా శివరాత్రికి ముందు దేవాలయంలో ఈ హోమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో గత మూడు రోజులుగా గ్రామం సుభిక్షంగా ఉండాలని హోమాలు నిర్వహిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న కరుణశ్రీ, పక్కన తహసీల్దార్, ఎంపీడీఓ

నగరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాధికారి కె.కరుణశ్రీ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమంలో కరుణశ్రీ పాల్గొని మాట్లాడారు. కాలుష్య నివారణకు మొక్కలు దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.రాధారమణ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ డైరెక్టర్ రాజ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలతో మహిళలు కలసికట్టుగా వ్యాపారాలు నిర్వహిస్తే అందరూ ఆర్థికంగా ఎదుగుతారని ఆయన సూచించారు. అనంతరం 30 గ్రూపుల వారు చేస్తున్న వివిధ రకాల వ్యాపారాల సమావేశాలు, ఇతర మీటింగ్‌లు ఏ విధంగా జరుగుతున్నాయన్న విషయాన్ని స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మంత్రి నాగార్జునపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

అమృతలూరు(భట్టిప్రోలు): వేమూరు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, అహర్నిశలు ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడుతున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పై కొందరు అవాకులు చవాకులు పేలడం సిగ్గుచేటని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం పేర్కొన్నారు. అమృతలూరులోని పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ విద్యా విభాగం జిల్లా కార్యదర్శి చొప్పర రాజశేఖర్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బర్మా ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ మూల్పూరు సర్పంచ్ మూల్పూరి రోజ్‌మేరి భర్త మాణిక్యాలరావు సోషల్ మీడియాలో మాదిగలు వివక్షతకు గురయ్యారని పేర్కొనడం సరికాదని అన్నారు. వ్యక్తిగత విషయాలను పార్టీకి ఆపాదించి మంత్రి నాగార్జునను మాదిగ వ్యతిరేకి అని సంబోధించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పోతార్లంక సురేష్‌కుమార్, నాయకులు మూల్పూరు సీతయ్య, గాజులవర్తి బెనహర్, అమృతలూరి వెంకయ్య, తెనాలి పవన్‌కుమార్, మానుకొండ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి దేవస్థానం ప్రతిష్ట మహోత్సవం

తాడికొండ: నేడు తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలో సోమేశ్వర పూర్వక వీరభద్రస్వామి వారి దేవస్థానం ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:11 గంటలకు ఉత్తర నక్షత్రయుక్త కుంభలగ్న పుష్కర కాలంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా బొడ్డురాయి, మహా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ వీరభద్రుడు, పరమశివుడు, నందీశ్వరుడు, ధ్వజ స్తంభం, శిఖర యంత్ర ప్రతిష్ఠాపన జరగనుననట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు వారు తెలిపారు.

24 గంటల్లో స్తంభాలు, వీధిలైట్లు

- సాయినగర్ కాలనీలో 40 ఏళ్లుగా లేని మౌలిక వసతులు
- కాలనీలో పర్యటించిన 24 గంటల్లోపే ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే ఆర్కే



సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వీధిలైట్లు

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడు అద్దేపల్లి వారి వీధి, ముగ్గురోడ్డులోని సాయినగర్ కాలనీలో మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి పర్యటించారు. పర్యటించిన 24 గంటల్లో బుధవారం రాత్రి విద్యుత్ స్తంభాలు వేసి, వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. అద్దేపల్లి వారి వీధిలో నివాసాలు ఏర్పాటు చేసుకుని 40 సంవత్సరాలు అయినా అక్కడ రోడ్డు నిర్మాణం గానీ, విద్యుత్ స్తంభాలు కానీ ఏర్పాటు చేయలేదు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి నుంచి దాదాపు 450 మీటర్ల వరకు సొంత వైర్లు లాక్కుని విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. 40 ఏళ్ల అనంతరం నిర్మించిన రోడ్డును పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే ఆర్కేను విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు కావాలని అడగడంతో పాటు, ప్రతిరోజూ నివాసాల్లో వచ్చే వ్యర్థాలను తీసుకు వెళ్లడానికి ట్రాక్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సౌకర్యాలన్నీ 24 గంటల్లో ఏర్పాటు చేయడంతో మంగళగిరి శాసనసభ్యులు ఆర్కేకు అద్దెపల్లి వారి వీధి వాసులు, సాయినగర్ కాలనీలో నివసించేవారు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన ఓ కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే, బుధవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దుగ్గిరాల మంచి[illegible]ందిన పచ్చిగడ్ల రవికుమార్ అనారోగ్యంతో ఇటీవల కాలంలో మృతి చె[illegible] మృతి చెందిన సమయంలో ఎమ్మెల్యే ఆర్కే వారి పిల్లల చదువుల ని[illegible] రూ.లక్ష ఇస్తానని హామీ ఇచ్చారు. దుగ్గిరాలలో ఓ కార్యక్రమంలో పాల్గొ[illegible] ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి [illegible]తుల మీదుగా పచ్చిగళ్ల రవికుమార్ భార్యకు ఆర్థిక సహాయాన్ని అ[illegible]. ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, దుగ్గిరాల స[illegible]ావత్ ఖుషీబాయి, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, మైనార్టీ సెల్ [illegible] షేక్ సుభాని పాల్గొన్నారు.

కేఎల్‌యూలో కేంద్ర బడ్జెట్‌పై వర్క్‌షాప్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై ఒక్క రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్ పాల్గొని, తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉపన్యసించారు. కేంద్ర బడ్జెట్ కమిటీ సభ్యులు చందు సాంబశివరావు, లంకా దినకర్ మాట్లాడారు. అనంతరం సత్యకుమార్‌ను డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు ఘనంగా సత్కరించారు. వీసీ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మిల్లెట్ బఫెట్..

వర్సిటీలో జరిగిన తృణధాన్యాల వంటకాల ప్రదర్శనలు, పోటీలను వై.సత్యకుమార్ ప్రారంభించారు. వర్సిటీ ఫుడ్ టెక్నాలజీ విభాగ అధిపతి డాక్టర్ కె. శ్రీనివాసులు, విద్యార్థి వ్యవహాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడారు. వి.దేవిశ్రీ రాగులతో తయారు చేసిన బిస్కెట్‌కు ప్రథమ బహుమతి దక్కించుకోగా, కొర్రలతో కేక్‌ను తయారుచేసిన సీహెచ్. అక్షయ ద్వితీయ బహుమతి అందుకుంది. తృతీయ బహుమతిని డి.తరుణ్ గెలుపొందారు.

విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డును మహిళతో ప్రారంభింపజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు.నగర పరిధిలోని నిడమర్రులో రూ. 3 కోట్ల తో చేపట్టిన పలు పనులను బుధవారం నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డితో కలసి పరిశీలించారు. నిడమర్రు నుంచి తాడికొండ వరకు లింకు రోడ్డు విస్తరణలో భాగంగా సుమారు 430 మీటర్ల పొడవుతో రూ.35లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం బీసీ కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలించారు. బీసీ కాలనీలో గడచిన మూడు దశాబ్దాలుగా సరియైన రోడ్లు కూడా లేక స్థానికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడేవారని, డ్రైనేజీలు కూడా లేకపోవడంతో మురుగునీటి సమస్యతో ఇబ్బందులు పడేవారని తెలిపారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో వారి ఇబ్బందులను పరిష్కరించేందుకు రూ.2.50 కోట్లతో ఎనిమిది సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు రెండు కిలోమీటర్ల సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. ఆయా నిర్మాణ పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి వీలైనంత త్వరలోనే జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలతో కలసి ఆవిష్కరించారు. నగరంలోని పెదకోనేరు అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించేందుకు వచ్చిన వారిని దేవస్థాన ప్రతినిధులు కలసి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరింపజేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 8గంటలకు స్వామి వార్లను, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేయనున్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 19వ తేదీ ఉదయం 8 గంటలకు నంది వాహనంపై ఊరేగింపు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు బ్రాహ్మణ సమారాధన సాయంత్రం 4 గంటలకు స్వామివారి దివ్య రథోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలి అర్బన్: విద్యా విధానంలో వస్తున్న మార్పుల్ని అందరూ అందిపుచ్చుకోవాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ స్కూలులో బుధవారం రిఫ్లెక్షన్ (ప్రతిబింబం) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా విధానంలో రాబోయేది డిజిటల్ యుగమేనని, దానిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాన్ని పారదోలేందుకు రిఫ్లెక్షన్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. తమ పాఠశాలలో డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి. గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామసాయి ధ్యాన మందిర వార్షికోత్సవం ప్రారంభం



అలంకరణలో సాయిబాబా మూల విరాట్

తెనాలి టౌన్ : రూరల్ మండలం కొలకలూరులోని రామసాయి ధ్యాన మందిరంలో శ్రీ సద్గురు సాయిబాబా వార్షిక మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, కలశ స్థాపన, అఖండ జ్యోతి, దీపారాధన చేశారు. ప్రత్యేకంగా బాబా వారిని అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వివిధ భజన సమాజ మహిళలు సాయినామ సంకీర్తన ఏకాహం నిర్వహించారు. అర్చకులు కారంశెట్టి శ్రీనివాసరావు పూజలు జరిపారు. కార్యక్రమంలో రామసాయి ట్రస్టు ప్రెసిడెంట్ బంకా సతీష్, వైస్ ప్రెసిడెంట్ మణిశెట్టి శ్రీనివాస్, సభ్యులు కొల్లిపర సీతారామ కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పోకల శివరామకృష్ణ, సీతారామయ్య, రవికుమార్, అమరేంద్ర ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారుడు సాంబశివరావుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం కార్తవరాయని కథ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం రాము చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, రంగస్థల కళాకారుడు వడ్డీ సాంబశివరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాలేపాటి వెంకటరమణ, యలవర్తి కృష్ణ, గుగ్గిలం సుబ్బారావు, నాగం రమేష్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, కృష్ణకాంత్, అప్పయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

పాలిథిన్ వినియోగాన్ని నివారించాలి

మున్సిపల్ కమిషనర్ విజయసారథి

రేపల్లె: పాలిథిన్ సంచుల వినియోగాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరిగిపోయేందుకు అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు భూమిలో కలిసేందుకు చాలా సమయం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల స్థానంలో ప్రత్యమ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. పాలిథిన్, ప్లాస్టిక్ పదార్థాల విక్రయాలకు పాల్పడినా, ప్రజలు వినియోగించినా జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

పెదపులివర్రు (భట్టిప్రోలు): లోక కల్యాణార్థం గ్రామంలో బుధవారం గుత్తావారిపాలెంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేద బ్రాహ్మణులు మేడూరి శ్రీనివాస్ దీక్షితులు ఆధ్వర్యంలో శిష్య బృందం స్వామి కల్యాణాన్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని రాజరాజ నరేంద్రస్వామి దేవాలయం నుంచి కల్యాణ వేదిక వద్దకు కోలాట భజన సంకీర్తనలతో స్వామిని ఊరిగింపుగా తీసుకువచ్చారు. గో పూజ అనంతరం హోమం నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కల్యాణంలో 21 మంది దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జంపని వీరయ్య, తాడేపల్లి వెంకట బసవయ్య, మేకల శ్రీనివాసరావు, పెసర్లంక శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. ప్రతి ఏటా స్వామి వారి కల్యాణాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ది.08-01-2023 ప్రకటన ఖండన

[illegible]

గుంటూరు. 08/02/2023

జి.సి.యస్. మల్లికార్జునరావు
అడ్వకేట్, గుంటూరు. సెల్ : 9848727258